


1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధం మంద కృష్ణ మాదిగ

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -342 మంగళవారం 21 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## జెఇఇ మెయిన్‌లో మనోళ్లదే హవా..



**జేఈఈ మెయిన్ 2026 సెషన్-2 ఫలితాలు విడుదల**

**దేశవ్యాప్తంగా 26 మందికి 100 పర్సంటైల్**

**వంద పర్సంటైల్ సాధించిన వారిలో 10 మంది తెలుగు విద్యార్థులు**

**టాప్ 2.50 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత**

**మే 17న జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష**

**న్యూఢిల్లీ : ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**
దేశంలో లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న జెఇఇ మెయిన్ సెషన్-2 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మధ్యాహ్నం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టిఎ అధికారులు.. తాజాగా పేపర్-1 (బిఇ/బిటెక్) పరీక్ష తుది ఫలితాలను ప్రకటించారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నెంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.జెఇఇ మెయిన్ తుది విడత **మిగతా 2లో...**

# మళ్లీ మాదే అధికారం





## జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభ నుంచే యుద్ధం



**జగిత్యాల / ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ పునర్నిర్మాణానికి మరో యజ్ఞం అవసరమని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేండ్లలోనే అన్ని రంగాలు అధ్వాన్న స్థితిలోకి వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే తొలివేటు హైడ్రాపైనే అని స్పష్టం చేశారు. జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం మొదలుపెడుతున్నట్టు ఆయన ప్రకటించారు. సోమవారం జగిత్యాలలో బీఆర్ఎం**మిగతా 2లో...**

**రాగానే హైడ్రా ఎత్తేస్తాం**

**తెలంగాణ పునర్నిర్మాణానికి మరో యజ్ఞం**

**రెండేండ్లలో అన్ని రంగాల్లో అధ్వానం**

**బీఆర్ఎస్‌లో చేరిన జీవన్‌రెడ్డి**

**పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకం**

**: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

## చర్చలపై అనిశ్చితి !

**మూసుకుపోతున్న దారులు !**

**టెహ్రాన్ ఆగ్రహం, ప్రతీకార దాడులు తప్పవని హెచ్చరిక**

**టెహ్రాన్, వాషింగ్టన్ :ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**
పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ మధ్య జరగాల్సిన రెండో దశ చర్చలపై సోమవారం అనిశ్చితి నెలకొంది. అమెరికా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తోందని పేర్కొన్న ఇరాన్, శాంతి చర్చలకు తమ ప్రతినిధి బృందాన్ని పంపే విషయమై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ప్రకటించింది. **మిగతా 2లో...**



## ఎట్లొస్తారో చూస్తాం..

**ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తాం**

**వచ్చే ఎన్నికల్లో చూస్కుందాం**

**ఔర్ ఏక్‌బార్ కాంగ్రెస్ సర్కార్**

**ఎవరడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం**

**భారీ మెజార్టీతో విజయం సాధిస్తాం**

**ప్రజాపాలన ఎందుకు పోవాలో జీవన్‌రెడ్డే చెప్పాలి**

**: రైతు ఉత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

**-హైదరాబాద ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**
'వచ్చే ఎన్నికల్లో నువ్వో.. నేనోడ తేల్చుకుందాం రా.. కేసీఆర్‌డ' అంటూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. 'ప్రజాపాలన పోవాలి.. కేసీఆర్ రావాలిడ అంటూ ఓ పెద్ద మనిషి అంటున్నారుడమా పాలన ఎందుకు పోవాలి? పాపాల భైరవుడి లాంటి కేసీఆర్ ఎందుకు రావాలో ఆయనే చెప్పాలిడ' అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రతిపక్షహోదా కూడా ఊడగొట్టకపోతే తన పేరు మార్చుకుంటానంటూ ఆయన శపథం చేశారు. ఔర్ ఏక్‌బార్ కాంగ్రెస్ సర్కార్ అంటూ నినదించారు. **మిగతా 2లో...**



## అవకాశాలను అందిపుచ్చుకునేలా

**ప్రతి రంగంలో దక్షిణ కొరియాతో భాగస్వామ్యం: ప్రధాని మోదీ**

**మూడు రోజుల భారత పర్యటనకు వచ్చిన దక్షిణ కొరియా అధ్యక్షుడు**

**ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా పలు ఒప్పందాలు**

**న్యూఢిల్లీ : ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**ప్రతి రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారతదేశానికి వచ్చారు. ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా ప్రధాని మోదీ, లీ జే మ్యూంగ్ సమక్షంలో పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి.

ఈ సందర్భంగా జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, చిప్స్ నుంచి షిప్స్ వరకు, టాలెంట్ నుంచి సాంకేతిక వరకు, **మిగతా 2లో...**



## ఉదంపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**లోయలోకి పడిన బస్సు ..20 మంది మృతి**



## కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఏమైంది?



**కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి సూటిప్రశ్న**

**సీబీఐ విచారణకు ఆదేశించకపోతే ఆందోళన ప్రారంభిస్తాం**

**ఆ భయంతోనే ఢిల్లీకి హరీశ్‌రావు పరుగు**

**బ్యారేజీల పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నాం**

**మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన సీఎం..అధికారులతో సమీక్ష**

# జెఇఇ మెయిన్‌లో మనోళ్లదే హవా..

**మొదటిపేజీ తరువాయి**

ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఈ పరీక్షల్లో దేశవ్యాప్తంగా 26 మందికి 100 పర్సంటైల్ స్కోరు రాగా.. వీరిలో ఏకంగా 10 మంది తెలుగు విద్యార్థులే ఉండటం విశేషం. 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టిన వారిలో జొన్నల రోషన్ మణిదీప్ రెడ్డి (ఏపి), మంథా శివ కామేశ్ (తెలంగాణ), నరేంద్ర బాబు గారి మహిత్ (ఏపి), తుంగా దుర్గా సుప్రభాత్ (ఏపి), డి భవితేశ్ రెడ్డి (తెలంగాణ), పసల మోహిత్ (ఏపి), సాయి రిత్విక్ రెడ్డి (తెలంగాణ), వివాన్ శరద్ మహేశ్వరి (తెలంగాణ), బి వెంకట చంద్రశేఖర్ రెడ్డి (ఏపి), రిషి ప్రేమ్‌నాథ్ (తెలంగాణ) ఉన్నారు.

జెఇఇ (మెయిన్) సెషన్ 1, సెషన్ 2 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని జాతీయ ర్యాంకులను కేటాయించారు. ఈ పరీక్షల్లో రాణించి టాప్‌లో నిలిచిన మొత్తం 2.50 లక్షల మందికి జెఇఇ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అవకాశం కల్పిస్తారు. మే 17న జరిగే ఈ పరీక్షకు ఏప్రిల్ 23 నుంచి మే 4 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగనుంది. 'అడ్వాన్స్‌డ్'లోనూ సత్తాచాటిన విద్యార్థులకు జోసా కౌన్సెలింగ్ ద్వారా ప్రతిష్టాత్మక ఐఐటిల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తుంటారు.

**జెఇఇ మెయిన్ ఫైనల్ కీపై అభ్యంతరాలు.. ఎన్‌టిఎ వివరణ**

జెఇఇ మెయిన్ ఫైనల్ కీపై సామాజిక మాధ్యమాల్లో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం కావడంపై ఎన్‌టిఎ స్పందించింది. తుది కీలను సమీక్షించినట్లు తెలిపింది. ఏప్రిల్ 8వ తేదీ సెషన్–2 కెమిస్ట్రీ పేపర్‌లో ప్రశ్నకు (క్యూ.691121589)కు సరైన ఆన్సర్ 3 అని తెలిపింది. ఏప్రిల్ 2న సెషన్–2లో జరిగిన ఫిజిక్స్ పేపర్‌లో ప్రశ్న (క్యూ.691121200)కు సరైన సమాధానం ఆర్ 60 అని తేల్చి చెప్పింది. నిపుణుల సమీక్ష అనంతరం వచ్చిన ఈ ప్రత్యామ్నాయ క్లెయిమ్‌లు తప్పుడు వ్యాఖ్యానాల ఆధారంగా ఉన్నట్లుగా పేర్కొన్న ఎన్‌టిఎ.. ఫైనల్ కీలో ఎలాంటి మార్పులూ లేవని స్పష్టం చేసింది.

# అవకాశాలను అందిపుచ్చుకునేలా



**మొదటిపేజీ తరువాయి**

ఎంటర్‌టైన్మెంట్ నుంచి ఎనర్జీ వరకు ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాల విలువ 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లీ జే యోంగ్ భారత పర్యటనలో ఉన్న దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్, ప్రధాని నరేంద్ర మోదీలతో కలిసి సెల్ఫీ దిగారు. సోమవారం నోయిడాలోని శాంసంగ్ తయారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర విందు సందర్భంగా ఈ ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. ఇరు దేశాల నేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా, భారత్‌లో శాంసంగ్ స్థానిక తయారీ సామర్థ్యాలను చాటిచెప్పారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ భారత్, వియత్నాం దేశాల పర్యటనలో భాగంగా భారీ వ్యాపార ప్రతినిధి బృందంతో కలిసి వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా జరిగిన కొరియా–ఇండియా బిజినెస్ ఫోరంలో హ్యుందాయ్, ఎస్‌కే గ్రూప్, ఎల్జీ సంస్థల అధినేతలతో సహా సుమారు 250 మంది కొరియా వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. 1996 నుంచి శాంసంగ్ తన నోయిడా ప్లాంట్‌లో బడ్జెట్ మోడల్స్ నుంచి ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్‌ల వరకు తయారుచేస్తోంది.

తన మూడు రోజుల పర్యటనలో భాగంగా, దక్షిణ కొరియా అధ్యక్షుడు ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. "మహాత్మా గాంధీ శాంతి స్ఫూర్తి ప్రపంచాన్ని శాంతితో నింపాలని ఆశిస్తూ, నేను కూడా అందుకు సంయుక్తంగా కృషి చేస్తాను" అని లీ పేర్కొన్నారు. శాంతి, ప్రజాస్వామ్యం పునాదులపై ఇరు దేశాలు ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు.

# ఉద్యోగం నుంచి డిస్మిస్

**ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డికి షాక్..**

**ఉద్యోగం నుంచి తొలగించిన ప్రభుత్వం**

**ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డిపై కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో సర్వీస్ నిబంధనలను బేఖాతరు చేస్తూ వైసీపీ అభ్యర్థుల తరపున బహిరంగంగా ప్రచారం నిర్వహించారనే ఆరోపణలతో ఆయన్ను ఉద్యోగం నుండి తొలగిస్తూ (డిస్మిస్) సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం తీవ్రమైన క్రమశిక్షణారాహిత్యం కిందకు వస్తుందని, దీనిపై జరిగిన విచారణ అనంతరం ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయంతో ఆయన కేవలం ఉద్యోగాన్ని మాత్రమే కాకుండా, తనకు లభించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్లు, పెన్షన్ ప్రయోజనాలను కూడా పూర్తిగా కోల్పోతారని తెలుస్తోంది.

# ఉదంపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**లోయలోకి పడిన బస్సు ..20 మంది మృతి**

**జమ్మూఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త): :**
జమ్మూకాశ్మీర్‌లోని ఉదంపూర్ జిల్లాలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రామ్‌నగర్ నుండి ఉదంపూర్‌కు వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలోపడింది. ఈ ప్రమాదంలో 20 మంది మృతి చెందారు. 36 మంది గాయాలయ్యాయి.. ఈ ఘటనపై పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కనోట్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. సోమవారం ఉదయం 10 గంటలకు కొండ ప్రాంతమైన రామ్ నగర్ నుంచి ఉదంపూర్ రహదారిపై వెళ్తున్న బస్సు మలుపు తిరేగే సమయంలో అదుపుతప్పి వంద అడుగుల లోయలోకి పడిపోయింది. సమాచారం అందిన వెంటనే స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్స్ చేపట్టారు.కాగా, ఈ ఘటనపై ఉదంపూర్ –రియాసి డిఐజి శివకుమార్ శర్మ మీడియాతో మాట్లాడుతూ.. బస్సు లోయలోకి పడే సమయంలో కింద రోడ్డుపై వెళుతున్న ఆటో రిక్షాను ఢకొఏట్టింది. దీంతో అందులోని ప్రయాణీకులు గాయపడ్డారని తెలిపారు. ఈ ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మతులకు రెండు లక్షల నష్టపరిహారం, గాయపడిని వారికి 50 వేల రూపాయల్ని పిఎం రిలీఫ్ ఫండ్ కింద సహాయం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. లెఫ్ట్ నెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ ఘటన హదయ విదారకరమన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులకు సాధ్యమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని ఆయన జిల్లా యంత్రాంగం, పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, ఆరోగ్య శాఖలను ఆదేశించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన వారు ఉదంపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నారు.



# కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఏమైంది?

**వరంగల్ ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**
కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణకు రాష్ట్ర శాసనసభ తీర్మానం చేసి పంపినా, కేంద్రప్రభుత్వం స్పందించడంలేదని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రం తక్షణం సీబీఐ విచారణకు ఆదేశించకపోతే కాళేశ్వరం నుంచే ఆందోళన ప్రారంభిస్తామని హెచ్చరించారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మేడిగడ్డ బ్యారేజిని ఆయన సందర్శించారు. అంతకుముందు కాళేశ్వరం దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మేడిగడ్డ బ్యారేజిను సందర్శించిన నేపథ్యంలో నేషనల్ డ్యాం సేఫ్టీ ఏజెన్సీ, తదితర కేంద్ర ఏజెన్సీ ప్రతినిధుల సమక్షంలో ప్రాజెక్టులో జరిగిన లోపాలను సాంకేతికంగా విశ్లేషించారు. ఈ సందర్భంగా అంబటిపల్లిలోని ఎల్అండ్‌టీ గెస్ట్ హౌజ్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం అవినీతిపై ప్రధాన నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్‌షా బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఏటీఎంగా మారిందని అనేక మార్లు మాట్లాడారని గుర్తుచేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాళేశ్వరం అవినీతిపై మాట్లాడుతూ విచారణ బాధ్యతల్ని సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్, హరీశ్‌రావులను జైల్లో పెడతామని ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఈ క్రమంలో కాళేశ్వరం అవినీతిపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన 624 పేజీల నివేదికను శాసనసభ పూర్తిస్థాయిలో చర్చించి, సీబీఐ విచారణకు లేఖ రాసిందని తెలిపారు. ఆ లేఖ రాసి 9 నెలలు గడిచినా, ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించలేదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు కాళేశ్వరం అవినీతిపై జడ్జిమెంట్ రిజర్వు చేసి, ఈ నెల 22వ తేదీన తీర్పు ఇవ్వనుందనీ, దానితో హడావిడిగా హరీశ్‌రావు, వినోద్‌కుమార్ ఢిల్లీకి పరిగెత్తారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సీబీఐ విచారణ చేపట్టకుంటే ఆందోళనకు దిగుతామని కేంద్రానికి లేఖ పంపిన నేపథ్యంలో, కేంద్రప్రభుత్వం ఎక్కడ విచారణకు ఆదేశిస్తుందోననే భయంతోనే హరీశ్‌రావు ఢిల్లీకి వెళ్లారని వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులను అడ్డుపెట్టుకుని విచారణ నుంచి తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ నేతలతో కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు.

రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి ఎన్నిసార్లు లేఖలు రాసినా, సీబీఐ విచారణపై స్పందించట్లేదన్నారు. గోదావరి జలాలను తెలంగాణ జిల్లాలకు తీసుకొచ్చి సస్యశామలం చేసేందుకు 1975లో ఆనాటి సీఎం జలగం వెంగళరావు, నాటి మహారాష్ట్ర సీఎం ఎస్‌బీ చౌహాన్‌లతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు.

# చర్చలపై అనిశ్చితి !

అమెరికా నౌకాదళం తమ దేశానికి చెందిన ఒక కార్గో నౌకపై కాల్పులు జరిపి దానిని స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ ఆగ్రహించింది. ప్రతీకార దాడులు చేస్తామని హెచ్చరించింది. నౌకలోని సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు సురక్షితంగా ఉన్నారని రూఢ చేసుకున్న తర్వాత దాడులకు దిగుతామని తెలిపింది. ఇదిలా ఉండగా అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, సీనియర్ అధికారులతో కూడిన బృందం చర్చల నిమిత్తం ఇస్లామాబాద్‌కు బయలుదేరింది. తాజా పరిణామాలు పశ్చిమాసియాలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

**అమెరికా దురాక్రమణపై స్పందిస్తాం : ఐఆర్‌జిసి**

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో తమ నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ భగ్గుమంది. అమెరికా దళాలపై 'అవసరమైన చర్యలు' తీసుకుంటామని హెచ్చరించింది. అమెరికా దళాల దురాక్రమణపై నిర్ణయాత్మకంగా స్పందించేందుకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) సిద్ధంగా ఉన్నదని తస్నిమ్ వార్తా సంస్థ తెలియజేసింది. నౌకలో సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా వున్నందున ఇరాన్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇలాంటి పరిస్థితులలో రెండో విడత చర్చలకు అవకాశమే లేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై స్పష్టం చేశారు. ఇరాన్ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే విషయంలో గడువులు, అల్టిమేటంలు విధించడంపై తమకు నమ్మకం లేదని ఆయన చెప్పారు.

**దిగ్బంధనం కొనసాగినంత కాలం చర్చల్లేవు**

తమ ఓడరేవుల దిగ్బంధనం కొనసాగినంత కాలం పాకిస్తాన్‌కు ప్రతినిధి బృందాన్ని పంపేదే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. 'హర్మూజ్‌ను తెరిస్తే, ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించడం కొనసాగితే మేము తప్ప అన్ని దేశాలు వ్యాపారం చేసుకుంటాయి' అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రకటనపై మండిపడిన ఇరాన్ చర్చల బృందం సభ్యుడు, రాజకీయ విశ్లేషకుడు మహమ్మద్ మరాండీ ఘాటుగా హెచ్చరికలు జారీ చేశారు. 'ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటుంది. యూఏఈ, బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్‌లను వెంటనే విడిచిపొండి. ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగి అన్నింటినీ ధ్వంసం చేస్తుంది' అని హెచ్చరించారు..

ఇదిలావుండగా, చర్చలపై సందిగ్ధత కొనసాగుతున్నప్పటికీ పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు జరిగే వేదిక వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**ఇరాన్ నౌకపై పలు రౌండ్ల కాల్పులు**

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్ ఓడరేవుల నుండి నౌకల రాకపోకలను దిగ్బంధించిన నేపథ్యంలో తమ ఆదేశాలను ఇరాన్ నౌక ఉల్లంఘించిందని, అందుకే తమ దళాలు దానిపై కాల్పులు జరిపి ఇంజిన్ గదికి నష్టం కలిగించాయని, ఆ తర్వాత తమ నావికులు నౌకను స్వాధీనం చేసుకున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకొచ్చారు. హర్మూజ్ జలసంధి సమీపంలో ఈ ఘటన జరిగింది. కాగా ఇరాన్ పతాకంతో గల్ఫ్ ఆఫ్ ఒమన్‌ను దాటేందుకు ప్రయత్నించిన నౌకకు చెందిన ఇంజిన్ గదిపై అనేక రౌండ్లు కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది.

**హర్మూజ్‌పై పట్టును వదులుకోం : ఇరాన్**

హర్మూజ్ జలసంధిపై నియంత్రణను వదులుకునే ప్రశ్నే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అది తమ నుండి విడదీయరాని హక్కు అని ఐఆర్‌జిసి మాజీ కమాండర్ ఇబ్రహీం అజిజి చెప్పారు. హర్మూజ్‌లో నౌకల రాకపోకలపై ఇరాన్ నిర్ణయం తీసుకుంటుందని, అనుమతులు కూడా ఇస్తుందని తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో శత్రువును ఎదుర్కోవడానికి హోర్మూజ్ ఒక ఆయుధంగా, ఆస్తిగా మారిందని తెలిపారు.

**భగ్గుమన్న చమురు ధరలు**

హోర్మూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి మూసివేయడంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ఏడు శాతం పెరిగి 96.88 డాలర్లకు చేరింది. ఇరాన్ కార్గో నౌకను అమెరికా స్వాధీనం చేసుకున్న తర్వాత శాంతి ఒప్పందానికి తలుపులు దాదాపుగా మూసుకుపోయిన నేపథ్యంలో సోమవారం చమురు ధరలు మరింతగా పెచ్చరిల్లాయి. శుక్రవారం నుంచి చమురు ధరలు పెరుగుతూనే ఉండడం గమనార్హం. హోర్మూజ్‌ను తెరుస్తున్నామంటూ ఇరాన్ చేసిన ప్రకటనతో దిగివచ్చిన చమురు ధరలు ఇప్పుడు మళ్లీ పెరుగుతున్నాయి. ఇప్పటివరకు పశ్చిమాసియాలో జరిగిన దాడుల్లో 3,375మంది మరణించారని ఇరాన్ సోమవారం ప్రకటించింది.

# మళ్లీ మాదే అధికారం

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాజకీయ ప్రత్యర్థులుగా తాము దశాబ్దాలుగా ఉన్నా తమ మధ్య స్నేహం కొనసాగుతూనే ఉందని కేసీఆర్ తెలిపారు.

కాంగ్రెస్, టిడీపీ తియ్యటి, పుల్లటి మాటలు

గతంలో తెలంగాణ పదంపై అసెంబ్లీలో సైతం నిషేధం విధించిన సమయంలో, ఇక్కడి ప్రజల పట్ల, మాట్లాడే భాష, బతుకు, నీళ్ల, ఉద్యోగాలు వనరుల మీద వివక్ష ఉండేదని కేసీఆర్ గుర్తుచేశారు. ఎస్సారెస్పీ కాలువ ఉన్న ప్రాంతం మొదలు మహబూబ్ నగర్ వరకు యువత ఉపాధి కోసం వలసలకు వెళితే పల్లెల్లో వృద్ధులే మిగిలిన పరిస్థితి ఆనాడు ఉండేదన్నారు. చేసిందేమి లేకున్నా నాడు పాలించిన కాంగ్రెస్, టీడీపీలు తియ్యటి, పుల్లటి మాటలు చెబుతూ ప్రజలను కట్టు బానిసలుగా మార్చాయన్నారు. నాటి సీఎం చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచితే దానికి వ్యతిరేకంగా తాను లేఖ రాశాననీ, కొంత మంది రైతులు వ్యతిరేకిస్తే హైదరాబాద్ బషీర్ బాగ్‌లో కాల్పులు జరిపి ముగ్గురిని చంపేశారని తెలిపారు. దాంతో తెలంగాణ సమస్యలకు పరిష్కారం ప్రత్యేక రాష్ట్రమే అని తాను నిర్ణయించుకున్నాననీ, ఒక్కడిగా బయలుదేరానని తెలిపారు. తెలంగాణ కోసం కాంగ్రెస్ పార్టీతో జతకడితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాడు తెలంగాణను ఎగబెట్టే ఆలోచనతో జాప్యం చేసిందని కేసీఆర్ తెలిపారు.

మాజీ సీఎం రోశయ్య 14ఎఫ్ తీసుకొస్తే దానికి వ్యతిరేకంగా కేసీఆర్ చచ్చుడోడతెలంగాణ వచ్చుడో అంటూ ఆమరణ నిరాహారదీక్షకు కూర్చుంటే అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం తెలంగాణ ప్రకటన చేశారని గుర్తుచేశారు. ఆంధ్ర ప్రజా ప్రతినిధుల



రాజీనామాల బెదిరింపులతో కేంద్రం వెనక్కి తగ్గితే మళ్లీ జేఏసీ పెట్టి మూడున్నరేండ్లు ఉధతంగా ఉద్యమం చేసి తెలంగాణ సాధించినట్టు తెలిపారు. 2014లో వచ్చిన తెలంగాణలో ప్రజలు ఆశీర్వదించి అధికారమిస్తే ప్రజల జీవితాల్లో మార్పు కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు కేసీఆర్ తెలిపారు. మిషన్ భగీరథతో అన్ని వర్గాల ప్రజలకు తాగునీరు, తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తిని 7 వేల నుంచి 20 వేల మెగావాట్లకు పెంచి 24గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశామని చెప్పారు. రైతుబంధు, దళిత బంధు తదితర పథకాలను అందుబాటులోకి తెచ్చినట్టు వివరించారు. బీఆర్ఎస్ ను ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీ అర్రాస్ పాట పాడినట్టు 6 గ్యారంటీలు, 420 హామీలంటూ అన్ని వర్గాల ప్రజలను వంచించిందని కేసీఆర్ దుయ్యబట్టారు. రైతులు పొలాలు ఎండిపోతున్నాయి, కనీసం సమయానికి యూరియా కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ ఏమైంది? అని ప్రశ్నించారు. నోటికొచ్చిన మాటలు అమలుకాని హామీలతో కాంగ్రెస్ ఊదరగొట్టినా బీఆర్ఎస్ 1.7 శాతం స్వల్ప ఓట్లతో ఓడిపోయిందని తెలిపారు. కొత్త ప్రభుత్వానికి పని చేసేందుకు అవకాశమివ్వాలనీ వేచి చూస్తే, చిల్లర మాటలు తప్ప నిర్మాణాత్మక కార్యక్రమం ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. పొదరిల్లులాగా తెలంగాణను మార్చి కడుపులో సల్ల కదలకుండా రైతులు బాగుండేలా చేసి అప్పగిస్తే యూరియా ఇవ్వడం చాతగానిది కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎందుకు దిగజారింది? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్, రైతుల భూముల ధరలు తగ్గాయనీ, మక్కలు కొనకుండా బోనస్ అంటూ బోగస్ మాటలు మాట్లాడుతున్నారనీ, చేనేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని విమర్శించారు. "పొద్దున లేస్తే కేసీఆర్ చావాలని అంటున్నావ్. నువ్వు ఎంత మొత్తుకున్నా కేసీఆర్ చావడుడ." అని కాంగ్రెస్ నేతల విమర్శలపై స్పందించారు.

ఉద్యోగులకు 72 శాతం పీఆర్సీని బీఆర్ఎస్ ఇస్తే, ఉద్యోగులు తాము పొదుపు చేసుకున్న డబ్బులను కూడా రిటైర్మెంట్ తర్వాత కాంగ్రెస్ సర్కార్ ఇవ్వడం లేదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయెంబర్స్ మెంట్ పథకాన్ని తాము కొనసాగిస్తే వాటికి బకాయిలు పెట్టి విద్యార్థులను వేధిస్తున్నదని విమర్శించారు. స్కాంలతో సింగరేణిని నాశనం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ హయంలో మున్సిపాల్టీలు మురికికూపాలుగా మారాయని దుయ్యబట్టారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగానే పూర్తి చేయడం లేదన్నారు. సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్టు కేసీఆర్ ప్రకటించారు. జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర్ రావు సబాధ్యక్షత వహించిన సభలో మండలి విపక్ష నేత మధుసూధనా చారి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌషిక్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్ రమణ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్లొస్తారో చూస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

ఎవరడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాండభారీ మెజార్టీతో ముప్పన్నెల జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూరిపల్లిలో నిర్వహించిన 'ప్రజాపాలన–రైతు ఉత్సవాల' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. సభావేదిక నుంచి రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పైనా, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆనాడు డీఎస్, వైఎస్ జోడెద్దుల్లా పని చేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. అదే మాదిరిగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు కార్యకర్తల సహకారంతో తాను రెండోసారి పార్టీని అధికారంలోకి తీసుకొస్తానని వ్యాఖ్యానించారు. తద్వారా చరిత్రను తిరగరాస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ ఓటమి తప్పదని, అది జగిత్యాలతోనే ప్రారంభమవుతుందని హెచ్చరించారు. ఉప ఎన్నికలు, సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందని గుర్తు చేశారు. చివరికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కేసీఆర్‌కు ఘోరీ కట్టామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ ఘోరీ మీద కాంగ్రెస్ జెండాను ఎగరేస్తామని హెచ్చరించారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..
మంగళవారం 21 ఏప్రిల్ 2026

# ఉట్కూరి కార్తీక్ గౌడ్ కుటుంబానికి పరామర్శ

## రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హింగే భాస్కర్


హింగే భాస్కర్

**ఎల్కతుర్తి/, ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉట్కూరి కార్తీక్ తండ్రి ఉట్కూరి అశోక్ కుటుంబాన్ని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ పరామర్శించారు. తన అనుచరులతో కలిసి గ్రామానికి చేరుకున్న ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హింగే భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా గౌడ కులానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేశారు. సన్న వడ్ల బోనస్ విషయంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని, ఇది రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మక్కజొన్న పంట సాగు చేసిన రైతులకు ఎకరానికి 25 క్వింటాళ్ల పరిమితితో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. మిగిలిన దిగుబడిని ఎక్కడ విక్రయించాలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. ఈ పరిమితిని ఎత్తివేసి రైతులు తమ ధాన్యాన్ని స్వేచ్ఛగా అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# శాంతినగర్ అభివృద్ధే లక్ష్యం

## ఒకే మాట-ఒకే బాటతో రెండోసారి సర్పంచ్‌గా రాయప్ప



**ఎల్కతుర్తి/, ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని శాంతినగర్ గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ వేలంగిని రాయప్ప తెలిపారు. గ్రామ ప్రజల మద్దతుతో రెండోసారి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి, సమగ్ర అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామంలో సుమారు పది శాతం మంది వ్యవసాయ రంగంలో కొనసాగుతుండగా, మిగతా వారు ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లినట్లు తెలిపారు. కొంతమంది వ్యాపార రంగంలో ఉన్నప్పటికీ, గ్రామ అభివృద్ధి విషయంలో అందరూ "ఒకే మాటఒకే బాట"తో ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో విశాలమైన రహదారులు, భవనాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు పూల మొక్కలు, పండ్ల మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంచుతున్నామని తెలిపారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. నీటి సౌకర్యం, మురుగు కాలువల విషయంలో సమస్యలు లేకపోయినా, రెండు మూడు రహదారులు సిమెంట్ రహదారులుగా మారాల్సి ఉందని, వాటిని మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామంలో మద్యం, గంజాయి వంటి చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉన్నామని, గ్రామ ప్రజలు శాంతియుతంగా జీవిస్తున్నారని అన్నారు. పోలీస్ స్టేషన్ అవసరం తెలియని స్థాయిలో గ్రామంలో శాంతి భద్రతలు నెలకొన్నాయని చెప్పారు.


వార్డు సభ్యులు, గ్రామస్థుల సహకారంతో శాంతినగర్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని సర్పంచ్ రాయప్ప స్పష్టం చేశారు.

# రైతన్నకు 'భరోసా' పండుగ : ఇల్లందలో సంబరాలు



**వర్ధన్నపేట/ఏప్రిల్ 20(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల చేయడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. సోమవారం ఇల్లంద రైతు వేదికలో ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సాగు నిధుల విడుదల దృశ్యాలను నాయకులు, రైతులు కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దు సత్యం మాట్లాడుతూ 1 నుండి 5 ఎకరాల లోపు ఉన్న 45.11 లక్షల మంది రైతులకు రూ.5,653 కోట్లు నేరుగా జమ కావడం చారిత్రాత్మకమని కొనియాడారు. గత నెలలో ఎకరం లోపు ఉన్న వారికి ఇప్పటికే రూ.3,590 కోట్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రేవంత్ రెడ్డి సర్కార్ రైతన్నలకు అండగా నిలిచిందని, ఇది ప్రజా ప్రభుత్వ విజయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, వ్యవసాయ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నేతల ధ్వజం



**వర్ధన్నపేట/ఏప్రిల్ 20(జర్నలిస్ట్ వార్త):** మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే పార్టీలు మారుతున్నారని వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల పాలనలో అరూరి నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ కేవలం ధనికుల పక్షాన నిలబడితే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం వంటి పథకాలతో పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కొనియాడారు. ముఖ్యంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కృషితో వంద పడకల ఆసుపత్రి, రెసిడెన్షియల్ పాఠశాల, కోర్టు వంటి శాశ్వత పనులు మంజూరయ్యాయని తెలిపారు. విద్యార్థులకు మెనూ ఛార్జీలు పెంచి, నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవం తెచ్చిందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్, బీజేపీలకు పరాభవం తప్పదని, కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల ఫోకస్

## అధికారులతో సమీక్ష.. ఆలస్యం అసలు వద్దన్న మంత్రి



**ఖమ్మం,/ ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా, నగర అభివృద్ధి పనులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కఠినంగా స్పందించారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులతో సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించి, పనుల పురోగతిపై ఆరా తీశారు. ఆలస్యం అసలు సహించబోమని, నిర్దేశిత గడువుల్లోనే పనులు పూర్తి చేయాలని అధికారులను స్పష్టంగా హెచ్చరించారు. నగరంలో నిర్మాణంలో ఉన్న కేబుల్ బ్రిడ్జి పనులపై ఆర్ & బి అధికారులతో సమగ్రంగా చర్చించిన మంత్రి, పనుల వేగాన్ని పెంచాలని ఆదేశించారు. సైడ్ డ్రైన్ల నిర్మాణం సహా నగరంలోని మౌలిక వసతుల పనులపై ఒక్కొక్కటిగా సమీక్షించి, ఎక్కడా నాణ్యత లోపాలు ఉండకూడదని సూచించారు. ఇరిగేషన్ అధికారులతో మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణంపై చర్చించిన తుమ్మల, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వర్షాకాలానికి ముందే పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. విద్యాశాఖ పనులపై కూడా మంత్రి దృష్టి సారిస్తూ, పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు ఆలస్యం కాకుండా వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు కఠినంగా ఆదేశించారు.

# జాతీయ నాయకులకు సన్మానం




**ఖమ్మం,/ ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల పార్టీ జాతీయ కమిటీలో స్థానం పొందిన పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు, అలాగే జాతీయ అధికార ప్రతినిధులుగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డి, తిరునగరి జోష్ణలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, మండూరి సాంబశివరావు పాల్గొని అభినందనలు తెలిపారు. అదేవిధంగా నాయకులు గుత్త సీతయ్య, వడ్డెం విజయ్, మహిళా నాయకురాలు చలసాని ఝాన్సీ రాణి, వాసిరెడ్డి స్వాతి, చెరుకూరి చలపతిరావు, బానోత్ చిట్టిబాబు నాయుడు, రామకోటి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సేవలో ముందుండాలని నాయకులు పిలుపునిచ్చారు.

# డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్న డా. తాళ్ల అజయ్

## విద్యార్థి నాయకుడి కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు



**నర్సంపేట, /ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):** డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు2026ను నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు డా. తాళ్ల అజయ్ అందుకున్నారు. ఈ అవార్డు ఆయన సామాజిక సేవలకు, అంబేద్కర్ భావజాల ప్రచారానికి గుర్తింపుగా లభించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏప్రిల్ 19న నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 9వ తెలంగాణ రాష్ట్ర మహాసభలో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అజయ్ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు బహుజన సాహిత్య అకాడమీ ప్రతి సంవత్సరం ప్రజా ఉద్యమకారులు, రచయితలు, కవులు, సంఘసేవకులకు ఈ అవార్డును అందజేస్తుందని తెలిపారు. విద్యార్థి నాయకుడిగా అంబేద్కర్ సిద్ధాంతాలతో సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్నందుకు డా. తాళ్ల అజయ్‌ను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు తాటికంటి ఐలయ్య, బాదె వెంకటేశం, బొమ్మకంటి రాజేందర్, అకెపోగు ప్రమోద్ మహరాజ్, ప్రవీణ్, మనోజ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మేరా భవాని మాత వేడుకలు.




**బయ్యారం/,ఏప్రిల్ 20.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలోని వెంకట్రాంపురం పంచాయతీ పరిధిలో శోక్లా తండా గ్రామంలో సోమవారం లంబాడా కులస్తులు మాలోత్ ప్రభాకర్, మమత పార్వతి దంపతులు తమ ఇష్ట దైవం ప్రతి సంవత్సరం అక్షయ తదియ లక్ష్మీ నరసింహ స్వామి ఇష్టమైన రోజు కృత్తిక నక్షత్రము హిందూ వారం శ్రీ వెంకటేశ్వర స్వామి మేరా భవాని ఉత్సవ విగ్రహాలను పురోహితులు నవీన్ శర్మ సమక్షంలో గ్రామంలో ఊరేగింపు చేస్తూ ఉత్సవాలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మండలంలోని నలుమూలల నుంచి భారీ ఎత్తున భక్తులు తమ మొక్కులు చెల్లించుకొని తమ ఇష్ట దైవాన్ని కొలిచారు. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో అన్ని వీధుల్లో భూజాలపై పల్లకిపై ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన భక్తులందరికీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తండా నాయకుడు తేజావత్ రామచంద్రనాయక్ కుటుంబ సభ్యులు, ఇతర నాయకులు బాణోతు రాందాసు నాయక్, బాణోత్ రాజేష్ నాయక్, హరి నాయక్, మంగిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో విన్నవేడి ఉధృతి

# జాగ్రత్తలే రక్షణ కవచం

వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడంతో విన్నవేడి (హీట్‌వేవ్) ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లడం ప్రజలకు ప్రమాదకరంగా మారుతోంది. వైద్య నిపుణులు, వాతావరణ శాఖ అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, కూలీలు వంటి వర్గాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుంది. ఈ సమయంలో బయటకు వెళ్లకుండా ఉండడం ఉత్తమం. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాల్సి వస్తే తలపై టోపీ, గుడ్డ కప్పుకోవడం లేదా గొడుగు ఉపయోగించడం ద్వారా సూర్యరశ్మి నుంచి రక్షణ పొందవచ్చు. అలాగే తెల్లని రంగు, తేలికపాటి దుస్తులు ధరించడం శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది.

వేసవిలో ద్రవాల వినియోగం అత్యంత కీలకం. ఎక్కువగా నీరు తాగడం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటి పానీయాలు తీసుకోవడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది. దాహం లేకపోయినా తరచూ నీరు తాగడం అలవాటు చేసుకోవాలి. వేడి ఆహారాలు, మసాలా పదార్థాలను తగ్గించి తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.




ఎండలో ఎక్కువసేపు పని చేసే వారు మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవడం తప్పనిసరి. చెట్ల నీడలో లేదా చల్లని ప్రదేశాల్లో కొంతసేపు ఆగడం ద్వారా శరీరానికి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు తమ పనివేళలను మార్చుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

విన్నవేడి లక్షణాలపై కూడా ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. తల తిరగడం, అలసట, చెమటలు తగ్గిపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే నీడలోకి వెళ్లి విశ్రాంతి తీసుకోవాలి. చల్లని నీరు తాగడం, శరీరాన్ని చల్లగా ఉంచడం అవసరం. పరిస్థితి తీవ్రమైతే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం ప్రాణాపాయాన్ని నివారిస్తుంది.

పిల్లలు, వృద్ధులు వేడి ప్రభావానికి త్వరగా లోనవుతారు. అందువల్ల వారికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. పాఠశాలలు, అంగన్‌వాడీలు, కార్యాలయాల్లో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం కూడా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, అవసరమైన సూచనలు జారీ చేస్తోంది.


మొత్తానికి, వేసవిలో విన్నవేడి ప్రభావం నుంచి రక్షణ పొందాలంటే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించడం అత్యంత అవసరం. చిన్న చిన్న జాగ్రత్తలే పెద్ద ప్రమాదాలను నివారించగలవు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు.


సీనియర్ జర్నలిస్ట్
కొట్టే సుధాకర్ లెనిన్
9908401581

# ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## వడదెబ్బ ప్రమాదంపై వైద్యుల హెచ్చరిక

**మధిర, /ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**



వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర ప్రభుత్వ వైద్యులు డా. కనకపుడి అనిల్ కుమార్ సూచించారు. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్న ఈ పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని సూచించారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, ముఖానికి రుమాలు కట్టుకోవాలని తెలిపారు.వేసవిలో తగినంత నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవాలని, జంక్ ఫుడ్, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలైన కళ్ళు తిరగడం, వాంతులు, అలసట, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని అన్నారు.ఆరోగ్యం మెరుగుపడకపోతే మధిర ఎన్‌జీఓస్ కాలనీలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# హమాలీల మధ్య చంద్రబాబు జన్మదిన వేడుకలు

## మిర్చి మార్కెట్‌లో అన్నప్రసాదం పంపిణీ



**ఖమ్మం,/ ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు ఖమ్మం మిర్చి మార్కెట్‌లో ఘనంగా నిర్వహించారు. మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీల మధ్య ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.తెలుగు యువత నాయకుడు నల్లమల రంజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హమాలీలతో కలిసి కేక్ కట్ చేసి జన్మదినాన్ని జరుపుకున్నారు. అనంతరం మిర్చి మార్కెట్‌లోని సుమారు 300 మంది హమాలీలకు అన్నా క్యాంటీన్ ఖమ్మం తరపున అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ ప్రతినిధులు ఆంజనేయులు, నరేష్, నవీన్, అశోక్, రవి, సతీష్, అజయ్ తదితరులు, హమాలీలు పాల్గొన్నారు.

# రైతు నమోదు లేకుంటే పథకాల నిలిపివేత

## తక్షణమే నమోదు పూర్తి చేసుకోవాలని సూచన

**దమ్మపేట/, ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**



మండలంలోని రైతులు తప్పనిసరిగా రైతు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. నమోదు లేకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మండలంలో మొత్తం 11,200 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 8,200 మంది మాత్రమే నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా సుమారు 3,100 మంది రైతులు నమోదు చేయించుకోలేదని పేర్కొన్నారు.రైతు నమోదు లేకుంటే ప్రధాన మంత్రి కిసాన్ సహాయం, ఎరువుల సరఫరా వంటి పథకాల లబ్ధి అందకపోవచ్చని వివరించారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతులు ఎక్కువగా నమోదు చేయించుకోలేదని తెలిపారు.అలాంటి రైతులు సమీపంలోని మీసేవ కేంద్రాలు, సాధారణ సేవా కేంద్రాలు లేదా వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించి వెంటనే నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. మిగిలిన రైతులందరూ ఆలస్యం చేయకుండా రైతు నమోదు ప్రక్రియను పూర్తిచేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

# ముల్కనూర్‌లో హిందూ ధర్మ సమ్మేళనం



**భీమదేవరపల్లి/ఏప్రిల్20 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో సోమవారం హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్ఞాన చైతన్యా నంద స్వామిజీ, ముఖ్య వక్త ఎక్క చంద్రశేఖర్, మహిళ వక్త ప్రొద్దుటూరి రూప హిందూ ధర్మ పరిరక్షణ, సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతపై ప్రసంగించారు. సమాజంలో ఐక్యత, నైతిక విలువలు పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో భజనలు, ధార్మిక ప్రసంగాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.






# అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా

## పోషణ అవగాహన కార్యక్రమాలతో సందడి






**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలంలోని దామెర, వల్లభాపూర్, తిమ్మాపూర్, కేశవాపూర్ తదితర అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించి చిన్నారుల ఆరోగ్యంపై చైతన్యం కల్పించారు.అంగన్వాడీ ఉపాధ్యాయులు చిన్నారులకు విద్యా సామగ్రిని అందజేసి, పోషకాహార ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతల సమక్షంలో కార్యక్రమాలు జరిగాయి.చిన్నారులకు పోషకాహారం అందిస్తూ ఆటపాటల ద్వారా విద్యను బోధిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లల మానసిక వికాసానికి అంగన్వాడీ కేంద్రాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, బాలామృతం వంటి ఆహార పదార్థాలు పిల్లల ఆరోగ్యానికి దోహదపడుతున్నాయని వివరించారు.అంగన్వాడీ కేంద్రాల్లో చదివిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలకు పంపే ముందు వీడ్కోలు వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని తెలిపారు. పిల్లల అభివృద్ధిని అంచనా వేసి ప్రగతి పత్రాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు.అంగన్వాడీ పర్యవేక్షకురాలు ప్రసూన మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీల్లోనే చేర్పించాలని, బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్, కేశవాపూర్ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, దామెరకు చెందిన మంకని పద్మ, అంగన్వాడీ ఉపాధ్యాయులు ప్రేమలత, త్రివేణి, శ్యామల, జ్యోతి, రమ, శోభ, ఆరోగ్య సిబ్బంది వసంత, వార్డు సభ్యులు కుమార్, కవిత, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

# దళిత ఉద్యమంలో వేగంగా ఎదుగుతున్న రాజారపు రత్నం

## రాష్ట్ర మండలిలో చోటు దక్కించుకున్న నాయకుడు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 18 (జర్నలిస్ట్ వార్త):**
వరంగల్‌లో జరిగిన దళిత కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభల్లో హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన రాజారపు రత్నం రాష్ట్ర మండలి సభ్యునిగా ఎన్నిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన, కేవలం నెల వ్యవధిలోనే రాష్ట్ర స్థాయిలో స్థానం సంపాదించడం సంస్థలో ఆయన పెరుగుతున్న ప్రభావాన్ని సూచిస్తోంది.ఈ సందర్భంగా రాజారపు రత్నం మాట్లాడుతూ జిల్లాలో దళితులపై కొనసాగుతున్న అన్యాయాలను ఇకపై సహించబోమని స్పష్టం చేశారు. అస్పృశ్యత, అంటరానితనం నిర్మూలనకు



కట్టుబడి పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. ఎక్కడైనా దళితులపై అన్యాయం జరిగితే బాధితుల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గమని తేల్చి చెప్పారు.తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర మండలి సభ్యత్వం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, రాష్ట్ర కార్యదర్శి మారపాక అనిల్ కుమార్, తక్కలపల్లి శ్రీనివాసరావు, కర్రె బిక్షపతి తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ సంస్థ విస్తరణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.
త్వరలోనే హనుమకొండ జిల్లాలోని 14 మండలాల్లో మండల కమిటీలు, గ్రామాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి దళిత కుల పోరాట సమితిని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. 59 ఉపకులాల సమస్యలను ప్రధానంగా తీసుకుని ఉద్యమాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నిమ్మల మనోహర్, రెంటాలపాల్గొన్నారు.

# కవిత పార్టీతో బిఆర్ఎస్‌కే దెబ్బ !

**ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్తపార్టీ ప్రకటన మరో నాలుగు రోజుల్లో రానుంది. ఆమె దూకుడు గా రాజకీయాలు నెరపుతున్నారు. టిఆర్ఎస్ పార్టీ పేరు ఖాళీగా ఉంది కనుక దానిని ఎవరైనా వాడుకో వచ్చని అన్నారు. అయితే ఈ నెల 25న ఆమె పార్టీ ప్రకటించనున్నారు. అప్పుడే పార్టీ పేరు ఏంటన్నది తెలుస్తుంది. ఈలోగా చేరికలను ప్రోత్సహిస్తున్నారు. దళితులు, ఆదివాసీలు, బిసిలు లక్ష్యంగా ఆమె చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇకపోతే టిఆర్ఎస్ పార్టీని పునరుద్ధరించే ఆలోచన ఉన్నట్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఇటీవల ప్రకటించారు. దీంతో ఇప్పుడు టిఆర్ఎస్ కవితకు దక్కిందా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే తెలంగాణ ఏర్పడ్డ తర్వాత రెండు పర్యాయాలు అధికారం దక్కడంతో అహంకారంతో విర్రవీగడం, ప్రజలను కావాలనే దూరం పెటట్డం, సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని చెప్పడం లాంటివన్నీ ప్రజలు గమనించారు. బుద్ది చెప్పాలన్న నిర్ణయానికి వచ్చిన ప్రజలు కెసిఆర్‌ను ఓడించారు. ఎపిలో కూడా జగన్ ఇలాగే నిరంకుశంగా పాలించారు. సొంత డబ్బా కొట్టుకోవడం, సొంత ప్రయోజాలే పాలనగా చూడడం, మద్యం, ఇసుక, మట్టి మాఫియాలు పెరగడం వంటి కారణాలన్నీ తోడయ్యాయి. ప్రజాధనంతో విశాఖలో ఇంద్రభవనాలు కట్టుకోవడం వంటివన్నీ ఎదురుదెబ్బతీసాయి. అందుకే 11 సీట్లకే పరిమితం చేశారు. పాలకులు ఒళ్లు దగ్గరపెట్టుకుని పాలించాలి. తెలంగాణలో ఇప్పుడు రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు కూడా ఇదేవిధంగా పనిచేస్తున్నారు. పైకి ప్రజాపాలన అని చెప్పి ప్రకటనలు చేయడం తప్ప, ఒక్క అభివృద్ధి పని జరగడం లేదు. ఇది రేవంత్ కూడా గుర్తించాలి. లేకుంటే కాంగ్రెస్ పార్టీకి కూడా ఇదే గతి పడుతుంది. ఇకపోతే అపర చాణక్యుడిగా పేరొందిన కేసీఆర్ 2023 ఎన్నికల్లో ఓడిపోయాక కనసీం అసెంబ్లీకి రావడం లేదు. ప్రజల్లోకి రావడం లేదు. ఠంచన్‌గా జీతాలు మాత్రం పొందుతున్నారు. ఈ క్రమంలో పార్టీ పేరును మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చే విషయం పరిశీలిస్తున్నామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చాలనుకున్నప్పుడు అది సరైన నిర్ణయం కాదని వచ్చిన విమర్శలను పట్టించుకోలేదు.




సరికదా జాతీయ పార్టీగా ప్రకటించి పలు రాష్ట్రాల్లో ఊరేగారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని వచ్చిన హెచ్చరికలను పెడచెవిన పెట్టారు. తెలంగాణ అన్న పేరుకు దూరమవడం తెలివి తక్కువ నిర్ణయమని గుర్తించలేకపోయారు. పార్టీలోని మెజారిటీ నాయకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉండేవారు. అయితే ఎవరూ నోరు విప్పడానికి సాహసించలేకపోయారు. భిన్నాభిప్రాయాలను కేసీఆర్ ప్రోత్సహించేవారు కాదు. ఎవరు కూడా ఆయన నిర్ణయాలను నిలదీసే ధైర్యం చేసేవారు కాదు. ఇది పార్టీలో ప్రజాస్వామ్యం లేదనడానికి నిదర్శనం. కెసిఆర్ చెప్పిందే వేదం అన్నట్లుగా పార్టీ నడిచింది. ప్రాంతీయ పార్టీల్లో ఇది సహజమే అయినా ఆలోచనలను పంచుకోవాలి. కేసీఆర్‌లో అపర చాణుక్యుడని, అనేక తెలివితేటలు ఉన్నాయని, ఆయన వేసే రాజకీయ ఎత్తుగడలకు తిరుగుండదని, ఆయన ఎలా చెబితే అలాగే జరుగు తుందని నమ్మే స్థితికి పార్టీ నేతలు వచ్చారు. ఈ కారణంగానే తెలంగాణ రాష్ట్ర సమితిని జాతీయ పార్టీగా విస్తరించి భారత రాష్ట్ర సమితి పేరిట ఇతర రాష్ట్రాలలో కూడా పోటీ చేసి తగినన్ని సీట్లు గెలుచుకొని కేంద్రంలో చక్రం తిప్పుతానని కేసీఆర్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. ఇతర ప్రాంతీయ పార్టీల నాయకులను కలిసి తనకుతాను అతిపెద్ద నాయకుడిగా ఊహించుకున్నారు. జాతీయ రాజకీయాల పేరుతో నేల విడిచి సాము చేసిన కెసిఆర్ బొక్కబోర్లా పడ్డారు. తెలంగాణను బాగుచేయకుండా, అవినీతికి గేట్లు తెరిచి, జాతీయ రాజకీయాలు అంటూ కేసీఆర్ ఊరేగడాన్ని తెలంగాణ సమాజం కూడా హర్షించలేదు. ఫలితంగానే 2023లో కెసిఆర్ ఓడించారు. పార్టీలో సమష్టి నిర్ణయాలు, ఆలోచనలకు తావులేకుండా చేయడం వల్లనే కేసీఆర్ రాజకీయంగా దెబ్బతిన్నారు. దీనికితోడు తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఉన్న వారిని బయటకు తరిమేశారు. తమకు తిరుగు లేకుండా చూసుకున్నారు. పార్టీలో పోరాటం చేసిన వారెవరూ లేకుండా చేయడం వల్లనే బీఆర్ఎస్‌కు ప్రస్తుత దుస్థితి ఏర్పడింది. తండ్రీ, తనయులదే పెత్తనంగా సాగింది. ఇద్దరు నేతల్లో నియంతృత్వ పోకడలు పెరగడంతో సమష్టి నిర్ణయాలకు ఆస్కారం లేకుండా పోయింది. అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేశామని ఇంత కాలానికి కేటీఆర్ అంగీకరించారు. ఇదొక శుభ పరిణామం. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో, అతిశయంతో వ్యవహరించిన వారికి గుణపాఠాలు తప్పవు. ఎన్టీఆర్ అంతటి నాయకుడు కూడా ఎన్నికల్లో ఓడిపోయారు. ఈ ఉదంతాలు తెలిసి కూడా కేసీఆర్ అదే బాటలో అహంభావంతో వ్యవహరించారు. నేల విడిచి సాము చేశారు. పరాజయం మూటగట్టుకున్నారు. ఏ పార్టీకైనా బలమైన నాయకుడు ఎంత ముఖ్యమో స్వతంత్రంగా ఆలోచించి ప్రజాభిప్రాయాన్ని అధినాయకుడికి నిక్కచ్చిగా చెప్పగలిగిన నాయకులు కూడా అంతే అవసరం. కేవలం కొడుకు, అల్లుళ్లను పట్టుకుని వేలాడడం వల్లనే ఈ దుస్తితి ఏర్పడింది. కూతరు కవిత బయటకు పోయింది. ఆమె పార్టీ పెడితే మొదట దెబ్బతినేది కూడా బిఆర్ఎస్ అని గుర్తించాలి.

# సిరి లేకున్నా పర్వాలేదు..
# గుణం ఉంటే చాలు.




మానవ జీవన యానంలో అత్యంత విలువైనది ఏది? అన్న ప్రశ్న ఎదురైతే.. నేటి భౌతికవాద ప్రపంచంలో మెజారిటీ ప్రజల సమాధానం ధనం అనే ఉంటుంది. కానీ, నిస్వార్థమైన జీవితానికి, మనశ్శాంతికి పునాది ధనం కాదు, మనిషిలోని గుణం. ఒకరికి సాయం చేసేంత స్తోమత మన దగ్గర లేకపోయినా నష్టం లేదు కానీ, ఎదుటివారిని మోసం చేయాలనే దుర్బుద్ధి లేకపోవడమే అసలైన సంస్కారం.

### ఆస్తి లేకపోవడం పేదరికం కాదు..


లోకంలో ధనం అనేది ఒక ప్రవాహం వంటిది. అది ఈరోజు ఒకరి దగ్గర ఉంటే, రేపు మరొకరి దగ్గరకు చేరుతుంది. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా, పరుల పట్ల దయాగుణం కలిగి ఉండటం, ఎవరికీ కీడు తలపెట్టకపోవడం అనేది కోటి రూపాయల దానంతో సమానం. సాయం చేయలేకపోవడం మన ఆర్థిక స్థితికి సంబంధించిన అంశం. అది అశక్తత మాత్రమే కానీ అపరాధం కాదు. కానీ, ఒకరి బలహీనతను ఆసరాగా చేసుకొని మోసగించడం అనేది వ్యక్తిత్వ హననం.

### మోసం, ఆత్మవంచన మార్గం

మాయమాటలతో పక్కవారిని వంచించి సంపాదించే సంపద తాత్కాలికమే. అక్రమ మార్గాల్లో ఆర్జించిన ధనం భోగాన్ని ఇవ్వగలదేమో కానీ, హాయిని ఇవ్వలేదు. తనను నమ్మిన వారిని మోసం చేయడం అంటే కేవలం వారిని వంచించడం కాదు, తనలోని అంతరాత్మను తానే చంపుకోవడం. మోసం చేసే గుణం మనిషిని నైతికంగా పతనం చేస్తుంది. సమాజంలో నమ్మకాన్ని కోల్పోయిన వ్యక్తి ఎన్ని అంతస్తుల మేడల్లో ఉన్నా, అతడు ఒంటరివాడే.

### నిజాయితీయే అసలైన బలం

నిజాయితీగా బ్రతకడం కష్టంగా అనిపించవచ్చు, కానీ అందులో ఉండే తృప్తి సాటిలేనిది. లోకమంతా ఒకటైనా సరే. నేను ఎవరికీ ద్రోహం చేయలేదు అన్న ధైర్యమే మనిషికి నిజమైన కవచం. ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టలేకపోయినా పర్వాలేదు కానీ, వాడు తింటున్న కంచంలో మట్టి పోయకూడదనే ఇంగితమే గొప్ప జీవన సూత్రం. నేటి పోటీ ప్రపంచంలో విలువలు. కనుమరుగవుతున్నాయి. గెలవడానికి ఎంతటి మోసానికైనా సిద్ధపడే మనస్తత్వం పెరుగుతోంది. అయితే, చరిత్రను గమనిస్తే కేవలం గొప్ప గుణం ఉన్నవారే చిరస్థాయిగా నిలిచిపోయారు. డబ్బుతో వస్తువులను కొనగలం కానీ, గౌరవాన్ని, ప్రేమని, విశ్వాసాన్ని సంపాదించలేం. అందుకే, చేతిలో సాయం చేసేంత ధనం లేకపోయినా పరవాలేదు.. గుండెల్లో ఒకరిని మోసం చేయాలనే ఆలోచన లేని గుణం ఉంటే చాలు. అదే మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దుతుంది



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్

## అందుబాటులోకి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారి

### సోమవరం నుంచి దేవరపల్లి వరకు టోల్‌తో ప్రారంభం



**ఖమ్మం/, ఏప్రిల్ 20 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మితమైన గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారి సోమవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. వైరా మండలంలోని సోమవరం ప్రవేశద్వారం నుంచి దేవరపల్లి ముగింపు ప్రాంతం వరకు టోల్ చెల్లింపుతో వాహన రాకపోకలకు అనుమతి కల్పించారు. ఈ రహదారి ప్రారంభంతో ప్రయాణికులు తక్కువ సమయంలో గమ్యస్థానానికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సులభంగా ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. అయితే ఈ రహదారిపై రెండు చక్రాల వాహనాలు, ఆటోలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు.

## హనుమకొండ నుంచి రాష్ట్ర సమితికి రొంటాల దేవా

### దళిత హక్కుల కోసం పోరాటం మరింత ఉద్ధృతం చేస్తా: దేవా

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 18 (జర్నలిస్ట్ వార్త):**



వరంగల్ మహానగరంలో ఏప్రిల్ 17, 18 తేదీల్లో ఘనంగా నిర్వహించిన దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో హనుమకొండ జిల్లా నుంచి రాష్ట్ర సమితి సభ్యునిగా రొంటాల దేవా ఎన్నిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ మహాసభల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. ఈ సందర్భంగా రొంటాల దేవా మాట్లాడుతూ జిల్లాలో దళితులపై కొనసాగుతున్న అన్యాయాలు, అస్పృశ్యత, అంటరానితనం ఇంకా పూర్తిగా నిర్మూలం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో సమాన హక్కులు అందరికీ కల్పించే దిశగా నిరంతరం పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. దళితుల గౌరవం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉద్యమాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు. ఇప్పటి వరకు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత కట్టుదిట్టంగా పని చేస్తానని, సామాజిక న్యాయం సాధన కోసం రాజీపడని ధోరణితో ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. రొంటాల దేవా ఎన్నికపై పలు ప్రజా సంఘాల నాయకులు, దళిత ఉద్యమ కార్యకర్తలు, పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. జిల్లాకు ఆయన నాయకత్వం మరింత దిశానిర్దేశం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు
# రాజ్యాంగ విరుద్ధం




### మంద కృష్ణ మాదిగ -దళిత క్రైస్తవులకు వెంటనే ఎస్సీ హోదా కల్పించాలి
### మతాలు మారినా మారని వివక్ష.. కులమే ఆధిపత్యం చెలాయిస్తోంది
### కాంగ్రెస్ పార్టీ దళిత క్రైస్తవులకు నమ్మకద్రోహం చేసింది
### హన్మకొండలో జరిగిన దళిత క్రైస్తవుల రాజ్యాంగ హక్కుల మహాసభ'లో ధ్వజం



**హన్మకొండ బ్యూరో/ఏప్రిల్ 20(జర్నలిస్ట్ వార్త);**
1950లో వెలువడిన రాష్ట్రపతి ఉత్తర్వులు దళితుల హక్కులను కాలరాస్తున్నాయని, అవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 25లకు పూర్తి వ్యతిరేకమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ విమర్శించారు. ఈ ఉత్తర్వులు దళిత క్రైస్తవుల మెడపై కత్తిలా వేలాడుతున్నాయని, వాటిని తక్షణమే రద్దు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. హన్మకొండ హంటర్ రోడ్డులోని అభిరామ్ గార్డెన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రిస్టియన్ పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన దళిత క్రైస్తవుల రాజ్యాంగ హక్కులు ,సామాజిక హోదా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్ బోడ డిన్న అధ్యక్షత వహించిన ఈ సభలో మంద కృష్ణ ఉద్వేగభరితంగా ప్రసంగించారు.

దేశంలో ఇస్లాం, క్రైస్తవం రాకముందు ఉన్న కుల వివక్ష నేటికీ కొనసాగుతోందని మంద కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కులం అనేది అన్ని మత విశ్వాసాల కంటే బలంగా తయారైంది. క్రైస్తవంలోకి వెళ్లిన అగ్రవర్ణాల వారి సామాజిక హోదా మారనప్పుడు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వారికి వర్తిస్తున్నప్పుడు. కేవలం దళిత క్రైస్తవులకు మాత్రమే ఎస్సీ హోదా ఎందుకు నిరాకరిస్తున్నారు? అని ఆయన ప్రశ్నించారు. సిక్కు, బౌద్ధ మతాల్లోని దళితులకు ఎస్సీ హోదా కల్పించిన కేంద్రం, దళిత క్రైస్తవుల పట్ల వివక్ష చూపడం తగదని అన్నారు.

దళిత క్రైస్తవులు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్మితే, ఆ పార్టీ వారికి తీరని అన్యాయం చేసిందని మంద కృష్ణ దుయ్యబట్టారు. 1947 నుండి 1977 వరకు ఏకచత్రాధిపత్యంగా పాలించిన కాంగ్రెస్, దళిత క్రైస్తవుల సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పుడు కూడా రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష నేతలెవరూ నోరు విప్పకపోవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని మండిపడ్డారు.

హక్కుల సాధన కోసం దళిత క్రైస్తవులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. న్యాయం, ధర్మం మన పక్షాన ఉన్నాయి. సిక్కు, బౌద్ధ దళితుల తరహాలోనే పోరాడి ఎస్సీ హోదా సాధించుకోవాలి. పాస్టర్ల మీద దాడులు జరిగితే ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. అంబేద్కర్ స్ఫూర్తితో ఎమ్మార్పీఎస్ ఈ పోరాటంలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్ల శ్రీనివాస్ సమన్వయకర్తగా వ్యవహరించగా, పెద్ద ఎత్తున దళిత క్రైస్తవులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



